క్లుప్తంగా

మెరుగైన సేవల్లో అగ్రగామి ఎల్‌ఐసీ



పుత్తూరులో యూనియన్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

పుత్తూరు: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో దేశంలోని అగ్రగామి సంస్థల్లో ఎల్ఐసీ ఒకటని అఖిలభారత భీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) పుత్తూరు శాఖ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ తెలిపారు. సోమవారం సంఘ ఆవిర్భావదినోత్సవాన్ని బ్రాంచి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా యూనియన్ ఉపాధ్యక్షుడు జి.వెంకటేష్ యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఏటా యూనియన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 2న ప్రభుత్వ ఆస్పత్రులోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ, 3వ తేదీ ఉచిత మెగా మెడికల్ క్యాంపు, 5న బ్రాంచ్ కార్యాలయం వద్ద రక్తదాన శిబి రం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు: పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం డీఆర్‌ఓ పెంచలకిషోర్‌కు స్థానిక సీపీఎం కార్యదర్శి వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలోని జ్యోతిబసు నగర్‌లోని హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈశ్వరాపురం లెక్కదాఖలాలోని సర్వే నంబర్ 10లో పశువుల మేత బీడు భూములకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నందిమంగళంలోని శ్మశాన స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సదాశివపురంలోని ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఇంటిపట్టాల వివరాలను వన్‌బీలోకి చేర్చాలని కోరారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



ఐరన్ మాత్రలను తీసుకుంటున్న గర్భిణి కార్డును పరిశీలిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: పిల్లల్లో రక్తహీనత తొలగించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడతాయని వైద్యాధికారి మోహన్ కృష్ణ తెలిపారు. సోమవారం ఆరోగ్య సిబ్బందితో ఆయన సీజనల్ వ్యాధులు, చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలకు వేస్తున్న టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత తొలగాలంటే తప్పకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు వేయడం ద్వారా పిల్లలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని, ప్రసవం ప్రభుత్వం ఆస్పత్రిలో చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు వేస్తున్న ఐరన్ మందులను పరిశీలించి వివిధ సూచనలు ఇచ్చారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

5న అమావాస్య కూటం

పుత్తూరు: స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ నిమిత్తం నిర్వహించే అమావాస్య కూటం ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు ఆలయ కోవిల్‌కార్లు సాళ్వాకం కిష్టప్పమొదలి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 19 వరకు నిర్వహించాల్సి ఉన్న బ్రహ్మోత్సవాలపై శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సభలో పెద్దలు పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా కోరారు.

వ్యాధుల కాలం..ఆరోగ్యం భద్రం



ఏకాంబరకుప్పం రెడ్డివారివీధిలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు



పుదుపేట ఎస్వీ గుడివీధిలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి ఆస్కారం
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం
- వ్యాధుల నియంత్రణకు వైద్య, శానిటేషన్ విభాగం చర్యలు

నగరి : వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. వర్షాలకు వీధులు, కాలువల్లో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల తాగునీరు కలుషితం అవుతున్నాయి. మరికొన్ని చోట్ల వర్షపు నీరు నిలిచి దోమలు పెరిగి పలురకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధుల కట్టడికి వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రజలు ఇళ్లల్లో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. ఇంటితో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, కామెర్లు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చు. ఇప్పటికే మున్సిపల్ శానిటరీ విభాగం వారు మురుగు కాలువలకు ఫాగింగ్ చేసే ప్రక్రియను ప్రారంభించారు.

జాగ్రత్తలు తప్పనిసరి..



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల కంటే జ్వరం తగ్గకపోతే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, యాంటీబయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు నీటిని కాచి తాగాలి. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

- డాక్టర్ ప్రభావతి, మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, నగరి

నివారణ చర్యలు..

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, వైద్యసిబ్బంది కృషి చేయాల్సి ఉంది. వారానికి ఒక్కరోజు డ్రైడే పాటించేలా వార్డుల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలి. సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోవాలి. జ్వరం వచ్చిన వారితో పాటు అనుమానితుల వద్ద కూడా రక్త నమూనాలు సేకరించాలి. అవసరమైతే ఉచితంగా మందులు పంపిణీ చేయాలి. కాలువల్లో మురుగు నిల్వకుండా చూడడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలి.
- మల, మూత్ర విసర్జన అనంతరం సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, కొబ్బరిచిప్పలు, టైర్లు, వాటర్ బాటిళ్ల, కూలర్లలో నీరు నిల్వ ఉంచరాదు.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి.
- చిన్నపిల్లలకు ఒంటిని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

రాస్ సేవలను సద్వినియోగం చేసుకోండి



వేరుశనగ విత్తనకాయలను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే వీఎం థామస్

కార్వేటినగరం: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామంలో రాస్ కృషి విజ్ఞాన పరిశోధన కేంద్రం (తిరుపతి) వారు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి న్యూఢిల్లీ వారి సహకారంతో నిర్వహిస్తున్న ‘నూనెగింజల సామూహిక మొదటి తరహా ప్రదర్శన క్షేత్రాలు’ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న ప్రధాన ఉద్యానపంటల స్థితిని వివరించారు. అలాగే ఉద్యానశాఖ శాస్త్రవేత సుధాకర్ మాట్లాడుతూ మామిడి కోత అనంతరం చేపట్టాల్సిన కొమ్మ కత్తిరింపులు, పోషకాలు యాజమాన్యం, కలుపు నివారణ, మామిడిలో అధిక దిగుబడి సాధించేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు 100 మంది రైతులకు అందించిన మేలురకమైన వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, కేవీకే సీనియర్ శాస్త్రవేత అలాగే హెడ్ శాస్త్రవేతలు దివ్య, సుధాకర్, రామకుమార్, నాగేశ్వరరాజు, చెంగల్రాయులు, జనార్దన్‌రాజు, చంద్రమౌళిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

కార్వేటినగరం: ప్రభుత్వ అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, నాగేశ్వరరాజు, రాజేంద్రరెడ్డి, బీగాల రమేష్, రవియాదవ్, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, తహసీల్దార్ పుష్పకుమారి, పంచాయతీ ఈఓ పీఎస్ మణి పాల్గొన్నారు.

పింఛన్లతో వృద్ధులకు భరోసా



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు: పింఛన్లు అందుకున్న వారు సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని గేట్ వీధిలో ప్రభుత్వం అందించిన పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, టీడీపీ నాయకులు డీఎన్ ఏలుమలై, జీవరత్నంనాయుడు, యుగంధర్, షణ్ముగరెడ్డి, ధనపాల్, గణేష్ పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు సోమవారం ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. నగరి మండలంలో 5644 మంది లబ్ధిదారులు ఉండగా 5473 మందికి, నగరి మున్సిపాలిటీలో 7891 పింఛన్లు ఉండగా 7393 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో, మండలంలోని వేలావడి ఎస్టీకాలనీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పెన్షనను పంపిణీ చేశారు.

సబ్‌స్టేషన్ల వారీగా సమస్యల పరిష్కారం



అధికారులతో సమీక్షిస్తున్న ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌స్టేషన్ల వారీగా సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. రూరల్ ఈఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇది ప్రతివారం కొనసాగుతుందన్నారు. అందులో సమస్యలను నమోదు చేసి వాటిని పరిష్కరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు. సబ్‌స్టేషన్ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 4న విద్యుత్ అదాలత్ కార్యక్రమం పైపల్లె సబ్‌స్టేషన్‌లో ఉంటుందని చెప్పారు. వందశాతం విద్యుత్ బిల్లుల వసూళ్లు చేయాలని ఆదేశించారు. పల్లెల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు అయితే సకాలంలో మార్చు చేయాలన్నారు. ఫీడర్ల వారీగా లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసులను సకాలంలో విడుదల చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఏఈలు, సబ్‌ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి నగదు విరాళం



నగదు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు సోమవారం ఓ దాత కుటుంబం నగదు విరాళంగా అందజేసింది. కర్నూలుకు చెందిన రుద్రనాథ్ కుటుంబం రూ.1,00,116 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సిబ్బంది వాసు, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.


రూ.44 లక్షల విలువైన సెల్‌ఫోన్ల అప్పగింత



పోగొట్టుకున్న ఫోన్లను ఎస్పీ చేతుల మీదుగా అందుకున్న బాధితులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో చోరీకి గురైన రూ.44 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను ఎస్పీ మణికంఠ బాధితులకు అప్పగించారు. చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. తప్పిపోయిన, చోరీ అయిన ఎలాగైనా తెప్పించి బాధితులకు అందజేయాలనే ఉద్దేశంతో ‘చాట్‌బాట్’ పేరిట ఓ యాప్‌ను రూపొందించామన్నారు. దీని ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ దేశంలో ఎక్కడ ఉన్నా తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ.44 లక్షల విలువైన 210 మొబైల్‌ఫోన్లను తీసుకొచ్చి బాధితులకు అందజేశామన్నారు. ఇప్పటి వరకు ఆరు దశల్లో 1,700 ఫోన్లను బాధితులకు అందించినట్టు వెల్లడించారు. బాధితులు ఫోన్–94409 00004 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అంటూ ఓ మెసేజ్ పెడితే చాలని చెప్పారు. మొబైల్‌ఫోన్లను తెప్పించడంతో ప్రతిభ చూపించిన చిత్తూరు సీసీఎస్ సీఐ ఎస్.రామాంజనేయులు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

రుయా ఇన్‌చార్జి ఏడీగా రమేష్



ఇన్‌చార్జ్ ఏడీ రమేష్‌ను సత్కరిస్తున్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా తదితరులు

తిరుపతి తుడా: తిరుపతిలోని రుయా ఆసుపత్రి ఇన్‌చార్జ్ ఏడీ(అసిస్టెంట్ డైరెక్టర్)గా పరిపాలనా అధికారి ఎం.రమేష్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆస్పత్రిలో బాధ్యతలు స్వీకరించారు. ఏడీగా పనిచేసిన రత్నరాజు ఆదివారం పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో పరిపాలన అధికారి రమేష్‌ను ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఇతర కార్యవర్గం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు

సత్యవేడు: నూతనంగా వెలువడిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధీనియం(బీఎస్ఏ) న్యాయ చట్టాలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్ర సర్కిల్ కార్యాలయం ఆవరణలో మూడు నూతన చట్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. నూతన సెక్షన్ల నమోదులో ఎస్‌హెచ్‌ఓలు పొరబాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టంలో వచ్చిన మార్పులను తెలుసుకోవాలని సూచించారు. సత్వర న్యాయమే కొత్త చట్టాల అమలు ప్రధాన లక్ష్యమన్నారు. ఎఫ్ఐఆర్ సౌలభ్యం, పోలీస్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసే విధానం, జీరో ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ దివాకర్ రెడ్డి, ఎస్.వీరాంజనేయులు, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

నగరి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నగరి, వెదురుకుప్పం, నింద్ర, విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు టీచ్ టూల్‌పై శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన మెరుగుపరచడానికి, విద్యార్థులకు అనుగుణంగా బోధించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి బోధన పద్ధతుల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పార్వతీదేవి, జిల్లా పరిశీలకులు ప్రభాకర వర్మ, విషయ నిపుణులు,ఉపాధ్యాయులు,సీఆర్పీలుపాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు

పాలసముద్రం : రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యం ఇవ్వాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం మిట్టదళితవాడలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో రైతులకు సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగులో రైతులకు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకూ పెరిగిపోతుండడమే కాక, ఉత్పత్తులు విషతుల్యాపై పోతున్నాయని చెప్పారు. విత్తన శుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటలకు వినియోగించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పొలంబడి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రసాయనిక మందుల వాడకం తగ్గించడంపై వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పాడిరైతుల నిరసన



పాల సేకరణ కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పాలముద్రం : మండల పరిధిలోని ఇందిరానగర్, సున్నుగుంట, కొత్తకండ్రిగ గ్రామాలకు చెందిన పాడిరైతులు తెచ్చిన పాలను ప్రభుత్వం నిర్వహిస్తున్న శ్రీజ డెయిరీ నిర్వాహకులు వద్దనడంపై పలువురు రైతులు సోమవారం పాల సేకరణ కేంద్రం ఎదుట నిరసన చేపట్టారు.

గతంలో తాము తమ గ్రామంలోని ప్రైవేటు డెయిరీకి పాలు పోసేవాళ్లమని, అధికారుల సూచనల మేరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న శ్రీజ డెయిరీకి పాలు పోయాలని చెప్పడంతో గత ఐదేళ్లుగా పోస్తున్నామని తెలిపారు. తాము అప్పులు చేసి పాడిపశువులు కొని పాల ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే శ్రీజ డెయిరీకి తమిళనాడు నుంచి పాలు వస్తున్నాయని, వాటినే మాత్రమే తీసుకుని, తమ పాలను ఎందుకు వద్దంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పాలను తీసుకునేలా చూడాలని కోరారు.

మామిడిలో సేంద్రియ సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గంగాధర్

ఐరాల: మామిడిలో రసాయన ఎరువులు, పురుగు మందులను వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో మామిడితోటలను సాగు చేయడం వల్ల చెట్లకు పురుగులు, తెగుళ్లను తట్టుకునే రోగ నిరోధకశక్తి పెరుగుతుందని డాక్టర్ గంగాధర్, ప్రకృతి వ్యవసాయ రైతు ఆనందనాయుడు పేర్కొన్నారు. మండలంలోని పుత్రమద్దిలో సోమవారం మామిడి సాగు చేసే రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి మామిడి సాగు వల్ల రైతులకు సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు, ఆదాయం చేకూరుతుందని తెలిపారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్



స్విమ్స్‌లోజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరిని సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో సోమవారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. సమాజంలో వైద్యుల స్థానం, వైద్యులు అందించాల్సిన సేవలపై ఆయన సూచనలు చేశారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన క్రమంలో వైద్యులు ప్రాణాలకు తెగించి ప్రజల్ని కాపాడారని ఆయన కొనియాడారు. వైద్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లను ఎప్పటికప్పుడు అధిగమించి ఆధునిక వైద్య విధానాన్ని అందుబాటులోకి తేవడంలో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైద్యాధికారులు డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ రామ్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ సత్యవతి, డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వనజాక్షమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతిలోని వైష్ణవి ఆసుపత్రిలో నగర మేయర్ డాక్టర్ శిరీష, ఆసుపత్రి అధినేత డాక్టర్ మునిశేఖర్, ఇతర వైద్యులు సిబ్బంది సంబరాలు నిర్వహించారు.



స్టెతస్కోప్ రూపంలో డాక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థులు